వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 335 గురువారం | 25 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# నీట్ నుంచి వైదొలగాలి

## శాసన సభలో తీర్మానం చేయాలి

## సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ బోయినపల్లి విజ్ఞప్తి

దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షతో లాభం కంటే నష్టమే ఎక్కువ ఉన్నందున నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు శాసన సభలో తీర్మానం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మొన్న తమిళనాడు, నిన్న పశ్చిమబెంగాల్, ఈ రోజు కర్ణాటక రాష్ట్రాలు నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు వారి రాష్ట్ర శాసనసభల్లో తీర్మానాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో పీజీ సీట్లు ఎక్కువ ఉన్నందున నీట్ ద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా లక్ష ఎంబీబీఎస్ సీట్లు ఉంటే అందులో దాదాపు 10శాతం 8,265 మంది విద్యార్థులు తెలంగాణలోనే ఉన్నారన్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ



వివరాలు 2లో..

# గంజాయి గత్తర



రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతున్నా చాపకింద నీరులా విక్రయాలు సాగుతూనే ఉన్నాయి. దీంతో దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన యువత గంజాయి మత్తులో తూలుతున్నారు. కిక్కు కోసం కొందరైతే, కొత్తదనం కోసం మరికొందరు మత్తుకు అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. జన సంచారం లేని ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలను అడ్డాలుగా చేసుకొని నిషాలో మైమరచి పోతున్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులే లక్ష్యాలుగా సాగుతున్న విక్రయాలతో అభం, శుభం తెలియని వారు సైతం మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఆ కిక్కులో అడ్డదార్లు తొక్కుతున్నారు. పలువురు నేరస్తులుగా మారుతున్నారు. అయితే ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడన్నట్లుగా పోలీసుల్లోనే కొందరు విక్రయదారులు ఇచ్చే తాయిలాలకు ఆశపడి వారి కొమ్ము కాస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. నగరంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే ప్రాంతాలు, వ్యక్తులు పోలీసులకు తెలిసినప్పటికీ వారు ఉదాసీనత ప్రదర్శిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. దీంతో నగరంలో గంజాయి విక్రయాలు రోజురోజుకూ ఊపందుకుంటున్నాయన్న ప్రచారం సాగుతోంది. అయితే ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు పోలీసులు అక్కడక్కడ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

- మత్తులో యువత చిత్తు
- విచ్చల విడిగా గంజాయి విక్రయాలు
- విద్యార్థులే లక్ష్యంగా అడ్డాలు
- దాడులు చేస్తున్నా ఆగని దందా
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు




2లో..

# మత్తుతో భవిష్యత్ అంధకారం

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



2లో..

# వికసిత్ భారత్ కాదు వివక్ష భారత్

- తెలంగాణకు ఒక చీకటి బడ్జెట్
- కేంద్రం బడ్జెట్ పై ఎంపీ కడియం కావ్య ఫైర్

## బోనాల ఉత్సవాల్లో మంత్రులు



8లో..



8లో..

# దామరతోగు అడవుల్లో.. ఎన్‌కౌంటర్

- మృతుడు భూపాలపల్లి జిల్లా బుద్ధారం వాసిగా గుర్తింపు
- ములుగు ఏజెన్సీలో భయానక వాతావరణం



# గంజాయి 'గత్తర'

**మత్తులో యువత చిత్తు**
**విచ్చల విడిగా విక్రయాలు**
**విద్యార్థులే లక్ష్యంగా అడ్డాలు**
**దాడులు చేస్తున్నా ఆగని దందా**
**అవగాహన కల్పిస్తున్న పోలీసులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గంజాయి, గుట్కా, ఖైనీ, ఇతర మత్తు పదార్థాలపై నిషేధం ఉన్నప్పటికీ నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయాలు విచ్చల విడిగా సాగుతున్నాయి. కొందరు వ్యాపారులు పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుని చిన్న చిన్న పొట్లాలుగా మార్చి ఎవరికి అనుమానం రాకుండా విక్రేతలకు చేరవేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని టీ షాపులు, పాన్ షాపులతోపాటు వివిధ ప్రాంతాల్లో విచ్చలవిడిగా విక్రయాలు సాగుతున్నాయి. సిగరెట్లలోనూ దీనిని నింపుకొని దమ్ము కొడుతూ ఆకాశం వైపు చూస్తూ మైమరచి పోతున్నారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో గంజాయి దందా చాపకింద నీరులా విస్తరిస్తోంది. కొత్తదనం కోసం టీనేజర్లు ఎక్కువగా దీనికి అలవాటుపడుతున్నారు. హైస్కూల్ విద్యార్థులు సైతం గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

### చుట్టుముడుతున్న ఆరోగ్య సమస్యలు..

మత్తు పదార్థాల వినియోగంతో యువత చిత్తవుతోంది. ఆర్థికంగా చితికిపోవడంతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. చిన్న తనంలోనే మత్తు పదార్థాలకు బానిసై తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులకు దూరమవుతున్నారు. సమాజంలో గంజాయి సేవిస్తున్న వారిపై చులకన భావం ఏర్పడుతోంది. గంజాయికి బానిసలుగా మారిన వారు దానిని కొనుగోలు చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అవసరమైతే హత్యలు, దోపిడీలకు సైతం వెనుకాడడంలేదు. టీనేజ్ లో సరదాగా అలవాటు చేసుకున్న మత్తు పదార్థాల సేవనం చివరికి ప్రాణాల మీదికి వస్తోంది.

### నియంత్రణ కరువు..

గంజాయితోపాటు పలు మత్తు పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ కళాశాలల్లో అప్పుడప్పుడు యువతకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్న పోలీసులు వాటిని మార్కెట్ లో లభించకుండా అడ్డుకునే చర్యలు చేపట్టడంలేదు. గంజాయి విక్రయాలను అడ్డుకోవాల్సిన కొంతమంది పోలీసులు విక్రయదారుల కొమ్ము కాస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పోలీసులు చేపట్టనున్న ఆకస్మిక దాడుల విషయాలను ముందస్తుగానే వారికి చేరవేయడం ద్వారా విక్రయదారులు అప్రమత్తమవుతున్న విమర్శలున్నాయి. పలు ప్రాంతాల్లో పోలీసుల కనుసన్నల్లోనే విక్రయాలు సాగుతున్నాయన్న ప్రచారం ఉంది. నగరంలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, ఇతర వ్యాపార కూడళ్లతోపాటు అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని అనేక ప్రాంతాల్లో గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలు సాగుతున్నట్లు పోలీసులకు తెలిసినప్పటికీ వారు ఉదాసీనత ప్రదర్శిస్తున్నరనే ఆరోపణలున్నాయి. పోలీసులు వీటి విక్రయాలపై ఉక్కుపాదం మోపితే నగరంలో వంద శాతం గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు చెక్ పెట్టవచ్చంటున్నారు. ఆ దిశగా పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# మత్తుతో భవిష్యత్ అంధకారం

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విద్యార్థులకు సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై జనగామ డివిజన్ పోలీసుల అధ్వర్యంలో స్థానిక క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం భారీన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షణికానందం కోసం మత్తు పదార్థాలను సేవించడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాలను సాధించడం ఓ కలగానే మిగిలి పోతుందన్నారు. కొంత మంది వ్యక్తులు తమ డబ్బు సంపాదన కోసం గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడి యువతకు అందించడం జరుగుతోందని, ఇలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావద్దని హితవు పలికారు. ఎన్నో అశలతో మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించి మీ బంగారు భవిష్యత్తుకై ఎదురుచూసే తల్లిదండ్రులకు రోదన మిగల్చవద్దన్నారు. మాదకద్రవ్యాల అదుపునకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడ్కెనా మత్తు పదార్థాలు సేవిస్తున్నా, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడే ఈ విభాగం ప్రత్యేకతన్నారు. ఎవరైన మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా సెల్ నెంబర్ 8712584473కు సమాచారం అందించడం ద్వారా వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పెద్దఎత్తున గంజాయి సమచారం అందించిన వారికి నగదు పురస్కారం కూడా అందజేస్తామన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రమాణం చేయించడంతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజ మహేంద్రనాయక్, జనగామ ఏసీపీ పార్ధసారథి , ఘన్ పూర్ ఏసీపీ భీమ్ శర్మ, నార్కోటిక్ విభాగం ఏసీపీ సైదులు, క్రీస్తుజ్యోతి ఇంజరింగ్ కళాశాల డైరెక్టర్ రెవరెండ్ విజయ పాల్ రెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు రఘుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, సాయిరమణతో పాటు జనగామ డివిజన్ ఎస్సైలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ కాదు వివక్ష భారత్

**తెలంగాణకు ఒక చీకటి బడ్జెట్**
**కేంద్రం బడ్జెట్ పై ఎంపీ కడియం కావ్య ఫైర్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణకు ఒక చీకటి బడ్జెట్ అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా బడ్జెట్ పెడుతున్నామని చెప్పిన కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతూ, కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు. దేశమంటే ఏపీ, బీహార్ మాత్రమే కాదన్నారు. ఈ రెండు రాష్ట్రాలను అభివృద్ధి చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందా అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీ తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజల ఆశలపై నరేంద్ర మోడీ నీళ్లు చల్లారని మండిపడ్డారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, గిరిజన యూనివర్సిటీకి కేటాయింపులు లేవని, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల కోసం ప్రవేశపెట్టినట్లుగా బడ్జెట్ ఉందని విమర్శించారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన వరంగల్ లో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదన్నారు. దేశంలో రెండో కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారక్క జాతరకు జాతీయ హెూదా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్న బీజేపీ రాష్ట్ర ఎంపీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో రాష్ట్ర బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలకు తెలంగాణలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. బీజేపీ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మరింత ఉద్యమిస్తామని, తెలంగాణకు జరిగిన అన్యాయంపై మంత్రులకు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ మా పోరాటం కొనసాగిస్తామని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# పారిస్ ఒలింపిక్స్ సంబురం




జూలై 26 నుంచి పారిస్ ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. 200కు పైగా దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. పారిస్లో ఇది మొదటి సారి కాదు. అంతకుముందు 1900, 1924 లో, ఇప్పుడు 2024 లో మొత్తం మూడు సార్లు పారిస్ ఒలింపిక్స్ కు ఆతిథ్యం ఇచ్చింది. ఆధునిక ఒలింపిక్స్ 1896లో గ్రీస్ రాజధాని ఏథెన్స్ లో ప్రారంభమైంది. నాలుగేళ్లకు ఒకసారి ఒలింపిక్స్ నిర్వహిస్తారు. అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ ఆతిథ్య దేశాన్ని నిర్ణయించి, ముందుగానే ప్రకటిస్తుంది. క్రీడాకారుల స్ఫూర్తి, స్నేహం ఒలింపిక్స్ లక్ష్యాలు. మన దేశం నుంచి 117 మంది అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్ లో పాల్గొంటారు. ఇప్పటివరకు మన దేశం 35 పతకాలు సాధించింది. ఈసారి మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధిస్తారని ఆశిద్దాం. ప్రధాన మంత్రి మోదీ జూన్ 30, ఆదివారం నాడు తన జాతీయ ప్రసారంలో తన శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రభుత్వం మన క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడం చాలా అవసరం.

**– కంఠంశెట్టి లక్ష్మన్ రావు**

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 25, జులై 2024
www.warangalvoice.net

# తెలంగాణ వ్యతిరేక కేంద్ర బడ్జెట్

## తెలంగాణపై ఎన్డీఏ వివక్ష నశించాలి
## వీసీకే, ప్రజాసంఘాల నిరసన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వికసిత్ భారత్ తో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణకు ఒక్క రూపాయి కేటాయించలేదని, తక్షణమే తెలంగాణకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విముక్త చిరుతల కచ్చి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో గురువారం నిరసన ధర్నా చేశారు. వీసీకే వరంగల్ జిల్లా అధ్యక్షుడు కన్నాల రవి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఎనిమిది సీట్లు బీజేపీకి ఇచ్చారని, బీజేపీ మాత్రం రిటర్న్ గిఫ్ట్ గా తెలంగాణకు బడ్జెట్ లో గుండు సున్నా ఇచ్చిందని విమర్శించారు. ఈ అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర బుడ్జెట్ పై తెలంగాణ అసెంబ్లీలో జరిగిన చర్చకు సమాధానం చెప్పలేక తెలంగాణ అసెంబ్లీ నుంచి బీజేపీ ఎమ్మెల్యేలు వాకవుట్ చేసి ముఖం చాటేశారని ఆయన విమర్శించారు. దక్షిణాది ఆత్మగౌరవ వేదిక రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేశారని ఆరోపించారు. మోదీ కుర్చీని కాపాడుకోవడానికి బీహార్, ఏపీలకు మాత్రమే నిధులు కేటాయించారని, ఇది దక్షిణాది వ్యతిరేక బడ్జెట్ అని క్రాంతి కుమార్ విమర్శించారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన మోడీ బడ్జెట్ లో బీసీలకు జనాభా ప్రకారం నిధులు కేటాయించకుండా, బీజేపీ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ఎవరూ బీజేపీకి ఓటు వేయొద్దని ఆయన పిలుపునిచ్చారు. దళిత గిరిజనులకు నిధులు కేటాయించని బడ్జెట్ ను దళిత బహుజన ఫ్రంట్ వ్యతిరేకిస్తుందని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నాడు. ఈ కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, వీసీకే నాయకులు మచ్చ విశ్వతేజ, వినయ్, బీసీ నాయకులు సూరం నిరంజన్, న్యాయవాదులు రంజిత్ గౌడ్, ఎగ్గడి సుందర్ రామ్, జేజే స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎకో టూరిజం అభివృద్ధికి పాకాల, ఏటూరు నాగారం ఎంపిక

## హర్షం వ్యక్తం చేసిన నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చారిత్రాత్మక, కాకతీయుల రాజులు ఏలినటువంటి ఘన చరిత్ర కలిగిన నగరం మన వరంగల్. దేశ విదేశాల నుంచి ఎంతోమంది టూరిస్టులు మన నగరంలోని వేయి స్తంభాల ఆలయం, వరంగల్ కోట, రామప్ప టెంపుల్ లాంటి చారిత్రాత్మక ప్రదేశాలను చూడటానికి వస్తూ ఉంటారు. ఇలాంటి ప్రదేశంలో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మంత్రి శ్రీధర్ బాబు గురువారం అసెంబ్లీలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాకాల ఏటూరు నాగారం ప్రాంతాలను ఎంపిక చేసినట్లు ప్రకటించటం జిల్లా వాసిగా ఆనందంగా ఉందని ప్రముఖ సామాజికవేత్త, వన సేవ సొసైటీ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచడానికి పర్యావరణ సమతుల్యానికి వీటితో పాటు తెలంగాణలో మరో ఐదు ప్రాంతాలను ఎంపిక చేయటం చక్కటి నిర్ణయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుకు, రాష్ట్ర ప్రభుత్వానికి నిమ్మల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాలలో వేదిక నిర్మాణానికి భూమిపూజ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడలో సభా కార్యక్రమాలు నిర్వహించుటకు గాను సభా వేదికను మరిపెడ పట్టణ శివారులోని ఆర్లగడ్డ తండాలో ఉన్న 'విద్య హెర్బ్స్ కంపెనీ సహకారంతో గురువారం భూమిపూజ నిర్వహించి నిర్మాణ కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయుడు అనంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరావు మాట్లాడుతూ విద్యాలయాల అభివృద్ధికి గాను విద్య హెర్బ్స్ వారు చేస్తున్న సహకారం మరువలేనిదన్నారు. పాఠశాలకు సభావేదిక నిర్మాణంతో పాటు, సౌండ్ సిస్టమ్, విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేయుటకు గాను వారు ముందుకు రావటం హర్షణీయమన్నారు. విద్య హెర్బ్స్ వారి స్ఫూర్తితో దాతలు విద్యాలయాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్య హెర్బ్స్ ఫౌండర్, ప్రెసిడెంట్ శ్యామ్ ప్రసాద్, జనరల్ మేనేజర్ రాజేష్ , డిప్యూటీ మేనేజర్ అడ్మిన్ శివ నాగ మల్లేశ్వర, ఉపాధ్యాయులు జనార్దనా చారి, దేవులా, నెహ్రూ, స్వప్న, ప్రకాష్ ,శౌరీ, లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహెదా బేగం, సురేష్, బాబురావు, అనిత, రాజకుమారి, సుధ, మంజుశ్రీలు పాల్గొన్నారు .

# అక్రమ కేసులు ఎత్తివేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఇంకా ఎన్నాళ్లు? తక్షణమే ఎత్తివేయాలని వామపక్ష నేతలు సాదుల శ్రీనివాస్, పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కోర్టుకు హాజరైన వామపక్ష నేతలు, గిరిజన రైతులు, సాలార్ తండా గిరిజన రైతుల కోసం చేసిన పోరాట కేసులో భాగంగా నేడు వామపక్ష నేతలు సాదుల శ్రీనివాస్ పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, శివాజీ, సురేందర్, వెంకన్న, బాలు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్, పెరుగు కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో సాలార్ తండా గిరిజన రైతుల కోసం వారి భూములు లాక్కుంటుంటే నాడు ఉద్యమిస్తే అక్రమంగా కేసులు పెట్టారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులపై కేసులు తప్ప చేసింది ఏమీ లేదన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు ఎత్తివేయాలన్నారు. కేసీఆర్ పాలనలో పదేళ్లు తెలంగాణ ప్రజలు నిర్బంధం ఎదుర్కొన్నారు, ఉద్యమకారులు కార్మికుల, రైతులపై, వామపక్ష పార్టీల నేతలు, ఇతర పార్టీ నేతలపై పెట్టిన అక్రమ కేసులన్నీ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ 2.91,159 లో విద్యా రంగానికి కేవలం రూ.21,292 (7.31శాతం) కోట్లు మాత్రమే నిధులు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగానికి తీరని అన్యాయం చేసిందని విద్యార్థి నాయకుడు హకీమ్ నవీద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం నిధులు కేటాయించాలని అనేక సందర్భంలో ప్రభుత్వానికి డిమాండ్ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా గత ప్రభుత్వాల మాదిరిగానే విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి, తీవ్ర నిర్లక్ష్యం చేసిందని హకీమ్ నవీద్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల, పేరుకుపోయిన రూ.7000 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ ఈ ప్రభుత్వ హయాంలో బాకీలు తీరుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న సందర్భంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో ఫీజు రీయింబర్స్ మెంట్ ఊసే లేదని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో బడ్జెట్ ను సవరించి విద్య రంగానికి 30శాతం నిధులు కేటాయించి, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ కు ప్రత్యేక నిధులను కేటాయించాలని హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు.

# సారథి కళాకారుల కళా ప్రదర్శన



**వరంగల్ వాయిస్, కాటారం:** మండలంలోని గ్రామాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కలెక్టర్, డీపీఆర్ఓల ఆదేశాలతో గ్రామాల్లో పర్యటిస్తూ కల ప్రదర్శనలు ఇస్తున్నారు. ఎడతెరిపిలేని వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మరుగుదొడ్డి వాడకం, పరిసరాల పరిశుభ్రత, దోమల వల్ల కలిగే జబ్బులపై అవగాహన, మత్తు పానీయాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దంటూ, మొక్కలు పెంచాలంటూ వారి కళారూపాలతో ప్రదర్శనలు ఇస్తున్నారు. అయితే గత మూడు నెలలుగా జీతాలు రావడంలేదని, ఇల్లు గడవడం కష్టంగా ఉందని, ప్రయాణ ఖర్చులకు అప్పులు చేయవలసి వస్తుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి కళాకారుల జీతాలు వెంటనే వేయాలని వారు తమ గోడును వెల్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఓనపాకల కుమార్ వారి బృందం పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గ్రామస్తులు, అతడితోపాటు పరిచయం ఉన్న వారు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రమేష్ కుటుంబానికి అండగా నిలవాలంటూ వాట్సప్ గ్రూపు ద్వారా సమాచారం ఇవ్వడంతో ఎంతోమంది స్పందించి ముందుకు వచ్చారు. వారంతా ఇచ్చిన ఆర్థిక సహాయం రూ.66,500లను రమేష్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల డైరెక్టర్ మాచర్ల ఎల్ల గౌడ్, ఎడ్ల మల్లయ్య, ఎడ్ల కుమార్, భూక్య శ్రీనివాస్, నాంపల్లి సంపత్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

## ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలో అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తక్కువ బడ్జెట్ కేటాయించి విద్యార్థులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలనీ కోరారు. స్టూడెంట్ మేనేజ్ మెంట్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని అన్నారు. పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ ను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యను అందించాలన్నారు. కాకతీయ యూనివర్సిటీకి ఎక్కువ బడ్జెట్ కేటాయించి రెగ్యులర్ వీసీని నియమించి విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఉండి విద్యార్థులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధార సురేష్, కేయూ ఇంచార్జి మచ్చ పవన్ కళ్యాణ్, కేయూ ఉపాధ్యక్షుడు హర్షం చరణ్, కిరణ్, సాయి, వెంకటేష్, భరత్, సురేష్, షకూర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ అభయహస్తానికి మెండిచేయి

## డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం 2024-25 గాను 2,91,159 కోట్ల తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో దళితుల ఆశలపై నీళ్లు చల్లిందని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ విమర్శించారు. దళితులను పొగిడినట్టె పొగిడి నొటితో మాట్లాడి నొసలితో వెక్కిరించినట్టుందని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో రూ. 17,700 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ అభయ హస్తంగా పేరు మార్చి ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో దీని ఊసే లేకపోవడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ ప్రత్యేక నిధి కింద రూ.36,750 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్ లో నిధులు తగ్గించి రూ.33,124 కోట్లు కేటాయించడం దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీకి గల సవతితల్లి ప్రేమకు నిదర్శనమన్నారు.

## బీటెక్ విద్యార్థిని చదువుకు చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వడ్డేపల్లిలో గల ఓయాసిస్ అనాథాశ్రమంలో ఎన్నారై కొండపల్లి దీప్తి సహకారంతో ఎస్సార్ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువున్న వరంగల్ కు చెందిన కొంగల హాసినికి ఫీజు నిమిత్తం రూ.1,07,500/- (లక్షా ఏడు వేయిల ఐదువందలు) ల చెక్కును విద్య ఫౌండేషన్ వ్యవస్థాకుడు బిల్ల మహేందర్, ఒయాసిస్ చారిబుల్ ట్రస్ట్ అధినేత ఒద్దిరాజు ప్రకాశ్ చేతుల మీదుగా అందించారు. విద్య ఫౌండేషన్ విన్నపం మేరకు హాసినిని దీప్తి దత్తత తీసుకొని బీటెక్ చదువు పూర్తి అయ్యేంత వరకు కాలేజీ ఫీజు చెల్లించడం జరుగుతుంది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ విద్యార్థి విద్యాభివృద్ధి కోసం కృషిచేస్తున్న దీప్తికి ఫౌండేషన్ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కశాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. 2 లక్షల 91 వేల 159 కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో 52 శాతానికి పైగా ఉన్న బీసీల సంక్షేమానికి అభివృద్ధికి 9వేల 200 వందల కోట్లు మాత్రమే కేటాయించడం బీసీలను నిరాశకు గురి చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ లో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి సంవత్సరానికి రూ.25 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని విస్మరించడమేంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం బీసీలను వంచించినదనే ఆ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడం జరిగిందన్నారు. చేనేత, గీత, మత్స్య, విశ్వకర్మ, నాయీబ్రాహ్మణ, కుమ్మరి, రజక , గొర్రెల పెంపకం దారుల మొదలైన చేతికులవృత్తుల వారిని కూడా బడ్జెట్ కేటాయింపుల్లో నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి బీసీ సంక్షేమానికి రూ.25 వేల కోట్లు కేటాయించాలని, చేతి వృత్తుల వారందరికీ పనులు కలిపించేందుకు వారి సంక్షేమానికి, అభివృద్ధికి తగిన విధంగా నిధులు కేటాయించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అన్ని వర్గాలకు సమానమైన బడ్జెట్

### జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇది ప్రజా బడ్జెట్ అని, అన్ని వర్గాలకు, శాఖలకు సరైన బడ్జెట్ అని వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్ అన్నారు. విద్య, వైద్యానికి, ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీలోకి 160 పలు రకాల రోగులను చేర్చడం శుభ పరిణామమన్నారు. ఇప్పుడు రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో ఈ బడ్జెట్ చాలా సరైన బడ్జెట్ అని కొనియాడారు. కేంద్ర బడ్జెట్ లో మన రాష్ట్రానికి అన్యాయం జరిగినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడకపోవడం, రాష్ట్ర బడ్జెట్ ను వ్యతిరేకించడం ద్వంద నీతికి నిదర్శనమన్నారు. గత ఆరు నెలల నుంచి అసెంబ్లీకి రాకపోవడం వాస్తవంగా బీజేపీపి డైరెక్షన్లోనే భయంతో కెసిఆర్ నడుస్తున్నట్లు అర్థమవుతుందని కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్ ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీ సలహాలు, సూచనలు చేసుకుంటూ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రభాకర్ అన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్టానికి అన్యాయం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారని కిసాన్ కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కందాడి అశోక్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి అనేక హామీలు ఇవ్వడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రంలో బీజేపీతరఫున 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినప్పటికీ బీజేపీ నాయకులు బడ్జెట్ పై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. మొదటి నుంచి తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాడని అన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే రైతన్నకు భరోసా

### దేశానికే ఆదర్శం సీఎం రేవంత్ రెడ్డి పాలన

### ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి



**వరంగ్ వాయిస్, హనుమకొండ :** ఇందిరమ్మ రాజ్యంలోనే రైతన్నకు భరోసా కల్పించడంలో దేశానికే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదర్శమని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు అండగా నిలబడే బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి రాష్ట్ర రైతాంగం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి రూ.72 వేల 659 కోట్లు కేటాయించారు. తెలంగాణ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో దేశానికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని రాఘవ రెడ్డి పేర్కొన్నారు. గతంలో కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పదేళ్లుగా రైతులను ఏ విధంగా మోసం చేసాయో తెలిసిందేనన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, గిట్టుబాటు ధర కల్పించకుండా ఢిల్లీ రైతు పోరాటంలో 700 మంది రైతాంగం చావడానికి కారణమైన బీజేపీకి మా ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతికత లేదన్నారు. పదేళ్ల ప్రభుత్వం నడిపిన కేసీఆర్ ధరణి వంటి వాటితో రైతాంగం హక్కులను కాలరాసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. లక్ష రుణమాఫీ మాటలకే పరిమితమైన కేసీఆర్, కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కడం వారికే చెల్లిందన్నారు. ఈ బడ్జెట్ లో ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం అంటే ఇందిరమ్మ రాజ్యంలోనే రైతుకు భరోసా అని మరోసారి నిరూపితమైందన్నారు. అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ. 72 వేల 659 కోట్లు కేటాయించడం పాటు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసిన విషయం కనుల ముందు ఉందన్నారు. పంద్రాగస్టు లోపు రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మాది చేతల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరూపించారని ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి పేర్కొన్నారు. అలాగే రైతులకు రైతు భరోసా, ఇంకా రైతు బీమా, పంట నష్ట పరిహారం కూడా ఉంటుంది. అందుకే వ్యవసాయానికి భారీగా నిధులు కేటాయించి చిత్తశుద్ధిని నిలుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రి వర్గాన్ని తెలంగాణ ప్రజలు, రైతాంగం ఆశీర్వదించాలన్నారు.

# రేగొండలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని పలు కార్యాలయాల్లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఆకస్మిక తనిఖీలతో సిబ్బందిని హడలెత్తించారు. గురువారం ఒకే రోజు మూడు ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీ నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో పారిశుధ్య లోపాన్ని గమనించి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే కాస్మొటిక్స్, భోజనం మెనూకు సంబంధించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యార్థులను పాఠశాల పరిస్తితి అడిగి తెలుసుకున్నారు. కూరగాయాలు బాగాలేకపోవడంతో వాటిని సరఫరా చేసేవారి నుంచి తాజా కూరగాయలు పంపించేలా చూడాలని అధికారులను అదేశించారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించి, రికార్డులను తనిఖీ చేశారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు డాక్టర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులపై వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామాల్లో జ్వర పరీక్షలు నిర్వహించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలు అధికంగా అయ్యేవిధంగా చూడాలన్నారు. పల్లె దవాఖాన డాక్టర్లు ప్రతి రోజూ గ్రామాల్లో ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట రేగొండ తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, ఎంపీవో రాంప్రసాద్, డాక్టర్ హిమా బిందు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## భూ నిర్వాసితుల సమస్యలపై పట్టింపేది?



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల కేంద్రంలోని తాడిచెర్ల ఓపెన్ కాస్ట్-1 బొగ్గు గనికి 500 మీటర్ల పరిధిలోని ఇల్ల సేకరణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని భూ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ డేంజర్ జోన్ 500 మీటర్ల పరిధిలో ఉన్న 2800 ఇండ్లను తీసుకొని పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గత ఫిబ్రవరిలో భూ నిర్వాసితులు ధర్నా చేయగా కేటీపీఎస్ చెల్పూర్ చీఫ్ ఇంజనీర్ సిద్దయ్య ఘటన స్థలానికి చేరుకొని నాలుగు నెలల్లో పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ కాస్ట్ బాంబు పేలుళ్లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని, బ్లాస్టింగ్ వల్ల వచ్చిన కెమికల్ వాసనలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డేంజర్ జోన్ లో ఉన్న ఇళ్లను సేకరించి ఆగస్టు చివరి వారంలోగా డేంజర్ జోన్ ఇళ్లకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ కాల పరిమితి పెంచి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని, ఓపెన్ కాస్ట్ లో బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు సంఘం ప్రధాన కార్యదర్శి అక్కపాక సమ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ తాండ్ర మల్లేష్, నిర్వాసితులు రావుల ఆంజనేయులు, బొబ్బిలి రాజయ్య, సారంగం, సందీప్, పేరయ్య పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వర్షాకాలంలో ప్రజలు తరచూ జబ్బుల బారిన పడకుండా గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పర్వతగిరి మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చు వ్యాధుల గురించి గ్రామ పంచాయతీ ప్రత్యేక దృష్టి పెట్టాలని, మంచినీటి సరఫరా విషయంలో జాగ్రత్తగా ఉండాలని, పారిశుద్ధ్యం ఎప్పటికప్పుడు సరిగా చేసుకోవాలన్నారు. గ్రామాలలో వీధి దీపాల సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ఉదయమే విధులకు హాజరై ప్రభుత్వ కార్యక్రమాలు అన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో మాలోతు శంకర్, ఎంపీఓ పాక శ్రీనివాస్, మండల నోడల్ అధికారి లింగారెడ్డి, ఏపీవో సుశీల్ కుమార్, ఎస్బీఎం కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

# శాంతి భద్రత పరిరక్షణలో అలసత్వంగా ఉండొద్దు

## భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** శాంతి భద్రతల పరిక్షణలో అలసత్వానికి అవకాశం ఇవ్వకుండా, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి, వివిధ పోలీసు స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకుని, సత్వర కేసుల ఛేధనకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ కిరణ్ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టుల్లో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. నేర ఛేదన కంటే, నేర నివారణ చాలా ముఖ్యమని ఎస్పీ



అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వానికి తావివ్వొద్దని, పోలీస్ స్టేషన్లలో బాధితులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఎంక్వైరీ చేసి చట్ట పరిధిలో వెంటనే కేసులు నమోదు చేసి వేగంగా సమస్య పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి నేరస్తుడికి శిక్ష పడేలా కేసులను పక్కా ఆధారాలతో నమోదు చేయాలని సూచించారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలతో పాటు రవాణా, అమ్మకాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సంపత్ రావు, గడ్డం రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, సుభాష్ బాబు, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** యువత పొగాకు, ధూమపానం దురలవాట్లకు దూరంగా ఉంటే భవిత ఉజ్వలంగా ఉండే అవకాశం ఉందని పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డీటీ మాచన రఘునందన్ సూచించారు. రెండు దశాబ్దాలుగా పొగాకు నియంత్రణ కోసం అలుపెరగని కృషి చేస్తున్న రఘునందన్ గురువారం మహబూబాబాద్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ దురలవాట్లు ఊబి లాంటివన్నారు. సరదాగా మొదలై జీవితాన్ని ఛిద్రం చేస్తాయని సూచించారు. స్నేహితుల ప్రోద్బలం వల్లనో లేదా తెలిసీ తెలియకో సిగరెట్, టుబాకో అలవాట్లకు యువత ఆకర్షితమౌతోందని రఘునందన్ ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లకు లోనయ్యే బదులు అదే సమయంలో ఉన్నత లక్ష్యం దిశగా బుద్ధికి పని చెప్తే సమాజం గర్వించదగ్గ వ్యక్తులుగా ఎదగడానికి ఎంతో ఆస్కారం ఉందని సూచించారు. యువతకు ప్రతి నిమిషం అమూల్యమైనదేనన్నారు. బాలలు, యువకులు తమ తల్లిదండ్రులకు తెలియకుండా చెడు అలవాట్లకు లోనయ్యే కంటే, గొప్ప ప్రయోజకులై కన్న వాళ్లకు, ఉన్న ఊరుకు పేరు, ప్రఖ్యాతులు తెచ్చి పెట్టవచ్చు అని చెప్పారు. సాధన చేస్తే సాధించలేనిది అంటూ ఏది లేదన్నారు. ఎంతో శక్తి, యుక్తి యువతలో నిబిడీకృతమై ఉన్నాయని, వాటిని చెడు అలవాట్లతో వక్ర మార్గంలో పెట్టే కంటే బుద్ధి బలాన్ని వజ్రాయుధంగా మలచుకుని అనుకున్నది సాధించవచ్చని పిలుపు నిచ్చారు.

# అలకనంద రాథోడ్‌కు గౌతమి నంది అవార్డు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలో అందరిని తన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకొని ప్రతిభ కనబర్చిన వర్ధమాన నృత్య కళాకారిణి బేబీ బానోత్ అలకనంద రాథోడ్ ను 2024 గౌతమి నంది అవార్డుతో పాటు జాతీయ స్థాయి ఐకాన్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 28 ఆదివారం హైదరాబాద్ లోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో జరిగే అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా అలకనంద రాథోడ్ కు గౌతమి నంది అవార్డు, జాతీయ స్థాయి ఐకాన్ అవార్డును ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ వారు అందచేయనున్నారు. గతంలో ఎన్నో సంస్కృతిక కార్యక్రమాల్లో తన నృత్య ప్రదర్శనను ప్రదర్శించి పలు రకాల జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకుని 2024 ఉగాది పురస్కారం సొంతం చేసుకున్నారు. చిన్న వయసులోనే భరత నాట్యం పట్ల ఎంతో ఆసక్తి చూపుతూ ప్రముఖుల ప్రశంసలు పొందుతున్నందుకు తల్లిదండ్రులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# శిథిలావస్థలో ఎంపీడీఓ ఆఫీసు

## వర్షానికి లీకవుతున్న భవనం

**వరంగల్ వాయిస్, రేగొండ :** జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా రేగొండ మండల ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయ భవనం పెచ్చులూడిపోతుండంతో నెత్తిమీద ఏదైనా పడొచ్చన్న భయంతో విధులకు హాజరవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు కంప్యూటర్లు ఫైల్స్ ఒక్క మూలన భద్ర పరచవలసిందే.. ఆదమరిస్తే కంప్యూటర్లు తడిసి ముద్దవుతాయి. ముప్పై ఏళ్ల కిందట నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం ఇప్పటివరకు ఎలాంటి మరమ్మత్తు పనులు చేయక పోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ కిటికీలు, దర్వాజాలు పూర్తిగా పుచ్చు పట్టి ఊడిపోతున్నాయి.గత ఐదు సంవత్సరాలుగా ఎంపీడీఓ కార్యాలయం పెచ్చులు ఊడుతూ బిచ్చులు రాలుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు.





### మరుగు దొడ్లు లేక ఇబ్బందులు..

రేగొండ మండల ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్లు కరువయ్యాయి. కార్యాలయానికి వచ్చే మహిళలు బహిర్భూమికి వెళ్లాలంటే కార్యాలయంలో ఒక్క మరుగు దొడ్డి లేక పోవడం విడ్డూరంగా ఉందని వారు వాపోతున్నారు. కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలతో నిండి దోమలు, ఈగలు, విష పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ఏర్పడుతోందని ఉద్యోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాకాలం కార్యాలయ ఆవరణలో మోకాళ్ల లోతు నీటితో నిండి ఉంటుందని, చెత్త చెదారం చేరడంతో దుర్వాసన వస్తుంటే ఉద్యోగం చేయలేక పోతున్నామని ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రేగొండ మండల ఎంపీడీఓ కార్యాలయం పై దృష్టి సారించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# జానపద గిరిజన విజ్ఞానపీఠంలో రెగ్యులర్ ఏఎం తెలుగు కోర్సు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జానపద గిరిజన విజ్ఞానపీఠంలో నూతనంగా రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు ప్రవేశపెట్టినట్లు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్య బాబూరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2024-25 సంవత్సరానికి గానూ రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సును నూతనంగా ప్రవేశపెడుతున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్య బాబూరావు అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం పలు పీజీ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. తెలుగు విశ్వవిద్యాలయానికి సంబంధించిన మరోక ప్రాంగణం వరంగల్ లో ఉన్న హంటర్ రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో నూతనంగా రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్య బాబూరావు మాట్లాడుతూ పీఠంలో నూతనంగా రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు ప్రవేశపెడుతున్నందున ఆసక్తి గల విద్యార్థులు తెలుగు కోర్సులో ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. ప్రవేశాల కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, సాధారణ రుసుముతో ఆగష్టు 9వతేదీ వరకు, ఆలస్య రుసుముతో ఆగష్టు 19వతేదీ వరకు తెలుగు యూనివర్సిటీ వెబ్ సైట్ %ఔఔఔ.వశ్రీబన్రబబఅఅఐవతీంఱ- ్ఎ.ఖఎ.అఅ%లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ వాయిదా

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం జులై 24న విడుదల చేసిన ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్‌ను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని విభాగాలలో ప్రీపీహెచ్‌డీ కోర్స్ వర్క్ పూర్తి కానందున,పరిశోధక విద్యార్థుల విజ్ఞాపన మేరకు ఈ చర్య తీసుకుంటున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. మరల ఈ ప్రీ పీహెచ్ డీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేసేది తరువాత ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

# పీజీ రెండోవ సెమిస్టర్ పరీక్ష టైం టేబుల్ విడుదల

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ (ఎంఏ /ఎం.కామ్ /ఎంఎస్సీ) రెండో సెమిస్టర్ పరీక్ష టైం టేబుల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహా చారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం విడుదల చేశారు. ఆగష్టు 7న మొదటి పేపర్, 9న రెండవ పేపర్, 12న మూడవ పేపర్, 14 న నాల్గవ పేపర్, 16 న ఐదవ పేపర్, 19న ఆరవ పేపర్ ఉనట్లు, పరీక్షలు మధ్యాహ్నం 2.00 నుంచి 5.00 గంటల మధ్య జరుగుతాయని ఆ టైం టేబుల్‌లో తెలిపారు.

# ప్రభాస్ ఫ్యాన్స్ సంబురాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గత నెల 27న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదలైన కల్కి సినిమా భారీ కలెక్షన్లు రాబట్టుతుంది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన ఈ సినిమా అత్యధిక కలెక్షన్లు రాబట్టిన సినిమాల జాబితాలో ఏడవ స్థానంలో నిలిచి, రూ.1000 కోట్ల కలెక్షన్ ను క్రాస్ చేయడంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ముకుంద థియేటర్ లో ప్రభాస్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు జినుక సైదులు, ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్ ఆధ్వర్యంలో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు ప్రభాస్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు మొదుగు కాటయ్య, రామ్ చరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు దాసరి రావిష్, పవర్ స్టార్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు ఆదెర్ల రఘు, ఉపాధ్యక్షుడు అనిల్, వెంకటేష్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు శాకుల అజయ్, నాగార్జున ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు పాకుల చరణ్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు, ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, యంగ్ రెబెల్ స్టార్ అభిమానులు చింటు, శ్యామ్, కిరణ్, హరీష్, తిరుపతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గూఢాచారి సీక్వెల్‌గా జి2

టాలీవుడ్ హిస్టరీలో ల్యాండ్ మార్క్‌గా నిలిచిపోయే సినిమాల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది గూఢచారి. అడివిశేష్ టైటిల్ రోల్ పోషించిన ఈ మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే ఫ్రాంఛైజీలో ఈ చిత్రానికి కొనసాగింపుగా జీ2కూడా వస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మేజర్ సినిమాకు ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. వినయ్ కుమార్ చేతిలో పిస్తోల్ పట్టుకున్న తాజా స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన జీ2 (ఉ2) ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచుతోంది. షూటింగ్ కొనసాగుతున్నట్టు తెలియజేశారు. అడివి శేష్ ఈ మూవీలో మరోసారి స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా జీ2 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.






# నారా రోహిత్ సుందరకాండ

నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో 'సుందరకాండ' చిత్రం తెరకెక్కుతుంది. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి ఈ ఫన్ ఫిల్డ్ రోమ్-కామ్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈచిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నారా రోహిత్. అయన నటిస్తున్న 20వ చిత్రమిది. నేడు నారా రోహిత్‌కి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో రోహిత్ ఇన్నోసెంట్ లుక్స్‌లో కూల్ డ్రెస్‌లో క్లాసీ, ఛార్మింగ్ గా కనిపించారు. చక్కని ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతుందని మేకర్స్ తెలిపారు. త్వరలో టీజర్‌ను త్వరలో విడుదల చేయనున్నారు. నారా రోహిత్ సరసన విర్తి వాఘని హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదీప్ ఎమ్ వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు.



# జంధ్యాల మార్క్.. మారుతీనగర్ సుబ్రమణ్యం




దర్శకుడు లక్ష్మణ్ కార్య ఇంతకు ముందు 'హ్యాపీ వెడ్డింగ్' అనే సినిమాకి దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించినంతగా నడవలేదు, కానీ లక్ష్మణ్ కార్య దర్శకత్వ పటిమ ఏంటో ఆ సినిమా ద్వారా తెలిసింది. అందుకే ఇప్పుడు రెండో సినిమాగా 'మారుతీనగర్ సుబ్రమణ్యం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాకి లక్ష్మణ్ కార్య దర్శకత్వంతో పాటు, రచన, మాటలు, స్క్రీన్ ప్లే కూడా అందించారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని తెలుస్తోంది. అయితే ఈ సినిమా గురించి పరిశ్రమలో ఒక టాక్ బయలుదేరింది. అదేంటంటే ఈ సినిమాని ఇప్పటికే కొంతమంది పరిశ్రమలోని వారు చూసారని, ఈ సినిమా చూసిన తరువాత నవ్వకుండా ఉండలేరు అని అంటున్నారు. ఈ సినిమాలో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషించారు. మామూలుగానే ప్రేక్షకులు ఒక సినిమాలో క్యారెక్టర్ పాత్రలో కనపడే రావు రమేష్ చెప్పిన మాటలని ఎంతో ఆస్వాదిస్తారు, అలాంటిది ఇప్పుడు అయన ప్రధాన పాత్రలో చేస్తున్న సినిమాలో అతని చెప్పే మాటలకి పడి పడి నవ్వాల్సిందే అని ఈ సినిమా చూసిన వాళ్ళు చెపుతున్నారు. ఇంకొక ఆసక్తికర అంశం ఏంటంటే ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ మేకర్స్ కూడా చూసారని, అందుకే వాళ్ళు ఈ సినిమాని టేక్ అప్ చేసారని ఒక వార్త నడుస్తోంది. అలాగే ఈ సినిమా ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూడా చూసి ఎంతో ఆస్వాదించారని తెలుస్తోంది. ఇందులో రావు రమేష్ లాంటి నటుడికి ఒక ఫుల్ లెంగ్త్ రోల్ ఇస్తే తన మాటలతో ఎలా ప్రేక్షకులని మంత్రం ముగ్దుల్ని చేస్తాడో ఈ సినిమా నిరూపిస్తుంది అని కూడా అంటున్నారు. హింసాత్మక సినిమాలతో ప్రేక్షకుడికి ఊపిరి ఆడక ఉన్నటువంటి ఈ సమయంలో ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' ప్రాణవాయువు లాంటిదని అంటున్నారు. 'ఇది ఒక జంధ్యాల మార్కు సినిమాలా ఉంటుంది' అని ఈ సినిమా చూసిన వ్యక్తులు అంటున్నారు. దర్శకుడు జంధ్యాల సునిశితమైన హాస్యంతో తనదైన శైలితో ప్రేక్షకులను తన సినిమాలతో కడుపుబ్బా నవ్వించేవారు, ఇప్పుడు అలాంటి సినిమాలు కరువయ్యాయి, కానీ ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' సినిమాతో ఆ కరువు తీరిపోతుంది అని అంటున్నారు. అలాగే ఇంత వరకు క్యారెక్టర్ పాత్రలు వేస్తూ వచ్చిన రావు రమేష్ ఈ సినిమాతో ప్రధానపాత్రలో కనపడుతున్నారు. మధ్య తరగతి కుటుంబాలకి చెందిన కథలు ఈమధ్య రావటం మానేశాయి, ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' తో అటువంటి సినిమాలకి శ్రీకారం జరుగుతుందని పరిశ్రమలో అనుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు అందరినీ అలరించాయి, ట్రేండింగ్ కూడా అయ్యాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఆగస్టు మూడో వారంలో విడుదల కావచ్చు అని అంటున్నారు.



# ఖోఖో నేపథ్యంలో మళయాల సినిమా

సినిమా ప్రియులను అలరించేందుకు కాస్త గ్యాప్ తర్వాత ఓ డబ్బింగ్ మలయాళస్పోర్ట్స్ డ్రామా చిత్రం ఖో ఖో డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. 2021లో విడుదలైన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్‌తో హిట్ చిత్రంగా నిలవడమే కాక, టీవీలో టెలికాస్ట్ అయి అత్యధిక టీఆర్పీ సాధించిన టాప్ 5 మలయాళ సినిమాల్లో ఒకటిగా రికార్డు సృష్టించింది. కత విషయానికి వస్తే.. కేరళలోని ఓ మారుమూల గ్రామంలోని ప్రభుత్వ మహిళల స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అవుతుంది మరియా ఫ్రాన్సిస్. ఈ క్రమంలో ఆమె అక్కడి పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ఓ ఖో ఖో టీమ్‌ను తయారు చేస్తుంది. ఈ నేపథ్యంలో మరియాకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి, పిల్లలు టీచర్‌కు సహకరించారా, మధ్యలో టీచర్ ట్రాన్స్‌ఫర్ అయ్యాక ఏం జరిగిందనే ఆసక్తికరమైన కథకథనాలతో సినిమా ఇంటిల్లిపాదిని అలరిస్తుంది. ఇప్పుడు ఈ సినిమా ఈటీవీ విన్ ఓటీటీలో తెలుగులో మన ముందుకు వచ్చింది.



# ఆకాశ్ పూరీ.. ఇకనుంచి ఆకాశ్ జగన్నాథ్

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు ఆకాశ్ పూరీ పేరును ఆకాశ్ జగన్నాథ్‌గా మార్చుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈవిషయాన్ని తెలియజేశారు. ఇకపై తన పేరు ఆకాశ్ పూరీ కాదని.. ఆకాశ్ జగన్నాథ్ అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్‌గా మారింది. కొత్త పేరు.. కెరీర్ పరంగా ఆయన నూతన విజయాలు అందుకోవాలని నెటిజన్లు కోరుకుంటున్నారు. ఉన్నట్టుండి ఆకాశ్ తన పేరు మార్చుకోవడానికి గల కారణం చెప్పలేదు. పూరీ జగన్నాథ్ తనయుడిగా ఆకాశ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 'చిరుత', 'బుజ్జిగాడు' తదితర చిత్రాల్లో బాలనటుడిగా అలరించారు. 'ఆంధ్రాపోరీ'తో హీరోగా మారారు. ఆ తర్వాత 'మెహబూబా', 'రొమాంటిక్', 'చోర్ బజార్' సినిమాల్లో నటించారు. ఆయా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమయ్యాయి.

# వరంగల్ నగరానికి రేవంత్ ఇచ్చింది.. గాడిద గుడ్డు

## బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి

### రాష్ట్ర బడ్జెట్ పై ఆగ్రహం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గురువారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కార్ వరంగల్ మహానగరానికి గాడిద గుడ్డు ఇచ్చిందంటూ మండిపడ్డారు. హనుమకొండ అభివృద్ధిని ప్రశ్నార్థకం చేశారని ఆరోపించారు. హైదరాబాద్ మహానగరానికి రూ.10 వేల కోట్లు కేటాయించి రాష్ట్ర రెండో రాజధానిగా అభివృద్ధి చెందాల్సిన వరంగల్ మహానగరానికి మొండిచేయి చూపించారని విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ కి రూ.1,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం హనుమకొండ భద్రకాళి బండ్ గురుంచి మాటే లేదన్నారు. హైదరాబాద్ త్రిపుల్ ఆర్ కి రూ.1,550 కోట్లు కేటాయించి వరంగల్ రింగ్ రోడ్ కి కనీసం 15 పైసలు కూడ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ యువతను నట్టేట ముంచుతూ ఉపాధి అవకాశాలను విస్మరించారన్నారు. వరంగల్ టెక్స్టైల్ పార్కుని అభివృద్ధి చేస్తామని చెప్పి నేతన్నాల నెత్తిన టోపీ పెట్టారన్నారు. అదే విధంగా హనుమకొండ - హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మాటే లేదని విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధిని మరిచారన్నారు. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కైన ఓరుగల్లు నగరంను హెల్త్ హబ్ గా చేస్తామని చెప్పి కనీసం 7 రూపాయిలు కూడ కేటాయించలేదని ధ్వజమెత్తారు.



### ఆరు గ్యారెంటీలకే దిక్కులేదు..

**- మందోటి మహేందర్ పటేల్**



తెలంగాణ ప్రజలకు మాయ మాటలు చెప్పి అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలకే దిక్కులేని పరిస్థితి నెలకొందని బీజేపీ 56వ డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్ విమర్శించారు. సరైన సమయానికి రైతుబంధు లేదు, అవ్వ తాతలకు పింఛను లేదు, 24 గంటల కరెంటు లేదు, వడ్లకు ఇస్తానన్న రూ.500 బోనస్ లేదు, జర్నలిస్టులకు స్వేచ్ఛ లేదు, రైతులకు సాగునీరు లేదు, పరిపాలన మీద దృష్టి లేదంటూ విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేలను కొనడంలో పెడుతున్న శ్రద్ధ పరిపాలన మీద లేదంటూ ఆరోపించారు.

### అంకెల గారడీ బడ్జెట్

**- జలగం రంజిత్**



బడ్జెట్ లో స్మార్ట్ సిటీ, టెక్స్ టైల్ పార్క్, వరంగల్ నగర అభివృద్ధి, మామునూరు విమానాశ్రయానికి రిక్త హస్తం చూపిన అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరంగల్ ప్రజలకు ఏం సమాధానం చెబుతారని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు జలగం రంజిత్ ప్రశ్నించారు. 2లక్షల 91 వేల 159 కోట్ల రూపాయలతో గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ చూడడానికి పెద్దగా కనిపిస్తున్నప్పటికీ అంకెలతో గారడీ తప్ప ఏమీ లేదన్నారు. ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసి నిధులను సమకూర్చిన స్మార్ట్ సిటీ పనులకు మ్యాచింగ్ గ్రాంట్ సమకూర్చడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనబడుతోందన్నారు. స్మార్ట్ సిటీ మ్యాచింగ్ గ్రాంట్ కు తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్‌కి మొండిచేయి

## బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

### కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో వరంగల్ జిల్లాకు గుండుసున్న (జీరో) ప్రకటించిందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ ఆరోపించారు. జిల్లాకి జరిగిన విపక్షను నిరసిస్తూ గురువారం సాయంత్రం 4 గంటలకు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నిరసన, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గంట రవి కుమార్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ అంగడి పోయి గొంగడి కొన్నట్టుగా ఉందన్నారు. రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ అంటూ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు మాట మారుస్తున్నదని ఆరోపించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు సీతక్క, కొండా సురేఖ, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకుంటే భారతీయ జనతా పార్టీ తరుపున రైతుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రధాని మోడీ రైతుల పక్షాన నిలబడి ఎరువుల, విత్తన సబ్సిడీలు అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డిసెంబర్ 9న రూ.2లక్షల రుణ మాఫీ ఒకేసారి అవుతుందని ఆశపడ్డారన్నారు. ఆ తర్వాత మాట మార్చి మళ్లీ ఆగస్టు 15 అంటూ హామీ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు పండించే ధాన్యంపై అసలు అవగాహనే లేదని, రాష్ట్రంలో 3కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిస్తుంటే ప్రభుత్వం కొనుగోలు చేసేది రెండు సీజన్లకు కోటీ 30 నుంచి కోటీ 40లక్షలు సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునారెడ్డి, కాసు శిల్ప, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కార్యదర్శి గడల కుమార్, సుమన్ కత్రి, కిసాన్ మోర్చా నాయకులు సాంబయ్య యాదవ్, ఎస్సీ మోర్చా నాయకులు మాదాసిరాజు, బీజేపీ నాయకులు చిలువేరు రాజేందర్, కూచన క్రాంతి కుమార్, మండల, డివిజన్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దామరతోగు అడవుల్లో.. ఎన్ కౌంటర్

## మృతుడు భూపాలపల్లి జిల్లా బుద్దారం వాసిగా గుర్తింపు

### ములుగు ఏజెన్సీలో భయానక వాతావరణం

**వరంగల్ వాయిస్, ములుగు :** గత కొంత కాలంగా స్తబ్ధతగా ఉన్న ములుగు ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జూలై 28 నుంచి మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతంలోని అడవుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులతో పాటు ములుగు జిల్లా పోలీసులు గత కొద్ది రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తాడ్వాయి మండలంలోని గుండాల అడవిలోని దామరతోగు వద్ద గురువారం ఉదయం పోలీసులకు - మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరుగగా పోలీస్ కాల్పుల్లో ఒక నక్సలైట్ మృతి చెందాడు. మృతుడు భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ గా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనతో ములుగు జిల్లా పోలీసులు అప్రమత్తమై ఏజెన్సీ ప్రాంతంలో అడవులను జల్లెడ పడుతున్నారు. అడవి ప్రాంతంలోని గొత్తికోయ గూడల్లో సోదాలు నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానిత వ్యక్తుల పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అటు మావోలా సంచారం, ఇటు పోలీసుల కూంబింగ్ లతో ప్రజలు ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో భయాందోళనకు గురవుతున్నారు. దామరతొగు అడవుల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఎంత మంది మావోయిస్టులు పాల్గొన్నారనే కోణంలో పినపాక, గుండాల, మణుగూరు పోలీసులతో పాటు ములుగు జిల్లాలోని మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి పోలీసులు అప్రత్తమై అడవిలో జల్లెడ పడుతున్నారు. అంతే కాకుండా ఈ కాల్పుల్లో ఎవరెవరు పాల్గొన్నారనే కోణంలో సైతం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఎన్ కౌంటర్ తో ములుగు జిల్లాలో ప్రశాంతత చెదిరినట్లైంది. ఎన్ కౌంటర్ మృతుడు బుద్దారం వాసి అని తెలియడంతో భూపాలపల్లి జిల్లా పోలీసులు సైతం అప్రమత్తం అయ్యారు.

## ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

### భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్

**వరంగల్ వాయిస్, ములుగు :** ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని, పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఎన్ కౌంటర్లలను వెంటనే ఆపివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన పేరుతో ఓ లేఖ వాట్సప్ గ్రూపుల్లో వైరల్ గా మారింది. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై మావోయిస్టు పార్టీ నిర్మూలనకు నిరంతరం పోలీసులతో అడవులను జల్లెడ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల కాలంలో బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తూ ప్రజల కోసం పని చేస్తున్న విప్లవకారులను హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం గుండాల దామరతోగు అటవి ప్రాంతంలో గురవారం జరిగిన ఎన్ కౌంటర్ లో అమరుడైన నల్లమూరి అశోక్ అలియాస్ విజేంధర్ (34) కి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.

## బోనాల ఉత్సవాల్లో మంత్రి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ సెక్రటేరియట్ లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో గురువారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రులకు ఆలయ సిబ్బంది, పూజారులు ఘన స్వాగతం పలికారు.

**హుందాగా వ్యవహరించాలి..**

సమాజంలో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలని, ప్రభుత్వ వ్యవస్థలో భాగమైన వారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆలిండియా సర్వీసుల్లో వికలాంగుల కోటాపై తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొండా సురేఖ స్పందించారు. దివ్యాంగులపై స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. ఒక ఉన్నతమైన స్థానంలో ఉండి, పర్యవసనాలను ఆలోచించకుండా మాట్లాడటం తగదని మంత్రి సురేఖ హితవు పలికారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వివక్షకు తావులేదని, అన్ని వర్గాల హక్కులకు రక్షణ ఉంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## 26, 27 తేదీల్లో.. ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లను ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ ఎ.సుభాషిని దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి స్పాట్ అడ్మిషన్లు బాలికలకు 26వ తేదీన మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికలు), బాలురకు 27న మడికొండ సాంఘిక సంక్షేమ కళాశాల (బాలురు) లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్పాట్ అడ్మిషన్స్ కొరకు ఆయా సెంటర్లకు ఉదయం 9 గంటలకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com